ప్రమాదం అంచున ప్రయాణం...

- గూడ్స్ ఆటోల్లో ప్రయాణికుల తరలింపు
- ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్ల నుంచి ప్రయాణికుల తరలింపు
- ఆటోల్లోనూ పరిమితికి మించి ప్రయాణం చేస్తున్న పరిస్థితి
- ఏ మాత్రం పట్టించుకోని ఆర్టీఏ, ట్రాఫిక్ అధికారులు



గూడ్స్ ఆటోలో ప్రయాణికులను తరలిస్తున్న దృశ్యం

పట్నంబజారు: ఏ మాత్రం నిబంధనలను అంటే లెక్కలేదు.. కనీసం అధికారులు పట్టుకుంటారన్న ఆలోచన అసలే లేదు.. దానికి కారణం అధికారుల నిలువెత్తు నిర్లక్ష్యమే. నారాకోడూరులో భారీగా ఉన్న ప్రయాణికుల ఆటో ప్రమాదానికి గురై ముగ్గురు మృత్యువాత పడ్డారు. సత్తెనపల్లి మండలం కట్టమూరు దగ్గర 20 మంది కూలీలతో వెళ్తున్న ఆటో బోల్తా పడిన ఘటన ఉంది. రూరల్ ప్రాంతాల్లో ఆర్టీఏ అధికారులు తనిఖీలు మాత్రం అంతంత మాత్రంగానే ఉండటం గమనార్హం.

జిల్లాలో పరిస్థితి ఇలా...

గుంటూరు జిల్లాలో మొత్తం సుమారు 30 వేల వరకు ఆటోలు ఉన్నాయి. అందులో 9, 132 ఆటోలు గూడ్స్ ఆటోలు కాగా, మిగతా ప్యాసింజర్ ఆటోలు. వీటిలో ముఖ్యంగా ఇతర ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్‌తో సుమారు 10 వేలు ఉన్నాయి. వీటిలో సుమారు 200పైగా టాటా మ్యాజిక్ ఆటోలు అమరావతి, తెనాలి, నందివెలుగు, పొన్నూరు, మంగళగిరి ప్రాంతాల వరకు తిరుతున్నాయి. అప్పి, బజాజ్ డీజిల్ ఆటోలు కూడా ఇక్కడ నుంచి సుమారు ఇతర ప్రాంతాలకు ప్రయాణికులను తరలిస్తున్నారు.

నిబంధనలకు తిలోదకాలిచ్చి....

మోటార్ వెహికల్ యాక్ట్ ప్రకారం స్పష్టంగా గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్ (సరుకులు తరలించేవి) వాటిలో ప్రయాణికులను ఎక్కించుకోకూడదని నిబంధనలు స్పష్టంగా ఉన్నాయి. అయినా ఆటోవాలలు వాటిని గాలికి వదిలేసి.. ఏకంగా గుంటూరు నగరంలోని ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్, ఇతర ప్రాంతాల నుంచి కూలీలను తరలించుకుపోతున్న పరిస్థితి. శుభకార్యాల నిమిత్తం వచ్చే వారు. గ్రామీణ ప్రాంతాల వారు కూడా గూడ్స్ ఆటోలనే ఆశ్రయించటం ప్రమాదానికి హేతువ అన్న విషయాన్ని గుర్తించాల్సిన అవసరం ఉంది. ఆర్టీసీ బస్టాండ్, బ్రహ్మానందరెడ్డి స్టేడియం, ఉల్ఫ్‌హాల్ గ్రౌండ్స్, లాడ్జి సెంటర్ నుండి పరిమితికి మించి ప్రయాణికులతో.. కనీస వేగ నియంత్రణ కూడా లేకుండా తిరుగుతున్నాయి. ఆటోలు నడుపుతున్న వారిలో అధికంగా మైనర్‌లు, లైసెన్స్‌లు లేని వారే అధికం.

ట్రాఫిక్ తలపోటు.....

ఆటోవాలల తీరుతో ట్రాఫిక్ తలపోటుతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న పరిస్థితులు ఏర్పడ్డాయి. ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఇన్, అవుట్ గేటు వద్ద రోడ్లుపైనే ప్రయాణికులను ఎక్కించుకునేందుకు ఆపటంతో ఇబ్బందులు కలుగుతున్నాయి. నందివెలుగు రోడ్డులో ఏకంగా ఆర్టీసీ బస్టాండ్‌ను బయటే అప్పి ఆటోల స్టాండ్‌ను ఏర్పాటు చేసి, రోడ్డుపై అడ్డంగా పెడుతుండటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. బ్రహ్మానందరెడ్డి స్టేడియం, పల్నాడు బస్టాండ్ సెంటర్, నాజ్‌సెంటర్, శంకర్‌విలాస్‌తో పాటు ముఖ్యకూడళ్లలో ఆటోవాలలు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నారు.

> **కేసులు నమోదు చేస్తాం**
>
> 
>
> గూడ్స్ ఆటోల్లో ప్రయాణికులను ఎక్కించుకోవడం, పరితిమికి మించి ప్రయాణం కూడా నిబంధనలకు విరుద్ధమే. కచ్చితంగా తనిఖీలు నిర్వహిస్తాం. నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తాం. వాహనాలను సీజ్ చేస్తాం. ప్రజలు గూడ్స్ ఆటోలు, ట్రాక్టర్‌లతో ప్రయాణం చేయకూడదు. అలాగే ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణాలతో ప్రమాదాల బారిన పడతామన్న విషయాన్ని గ్రహించాలి.
>
> – కె.సీతారామిరెడ్డి, డీటీసీ, గుంటూరు జిల్లా

ఆర్టీసీ ఆదాయానికి అడ్డుకట్టే...

ప్యాసింజర్ ఆటోలు, గూడ్స్ ఆటోల వలన ఆర్టీసీకీ తీవ్ర నష్టం వాటిల్లుతోంది. నిత్యం జిల్లాలోని గుంటూరు డిపో 1, 2, తెనాలి, మంగళగిరి, పొన్నూరు డిపోలకు సంబందించి రూ 1.20కోట్లు ఆదాయం ఆర్టీసీకీ వస్తుంది. అయితే ఆర్టీసీ బస్టాండ్ వద్ద నుండే దూర ప్రాంతాలకు బాడుగుల మాట్లాడుకుని ప్రయాణికులను తీసుకుని వెళ్తుండటంతో ఆర్టీసీ ఆదాయానికి ఆటోవాలలు అడ్డుకట్ట వేస్తున్నారు.

క్లుప్తంగా

నేడు డయల్ యువర్ కమిషనర్

నెహ్రూనగర్: డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం సోమవారం నిర్వహించనున్నట్లు కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో ఉదయం 9.30 గంటల నుంచి 10.30 వరకు నిర్వహించే కార్యక్రమానికి 0863–2224202 నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు. అనంతరం ప్రజల నుంచి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)ను కౌన్సిల్ హాల్‌లో మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

అలరించిన సంగీత విభావరి



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై ఆదివారం సాయంత్రం మహతి స్వరసుధ రజతోత్సవాల్లో భాగంగా సినీ సంగీత విభావరి నిర్వహించారు. తొలుత టీజేపీఎస్ కళాశాల కార్యదర్శి కేవీ బ్రహ్మం, ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు లంకా విజయబాబు, సభ్యులు కన్నెగంటి బుచ్చయ్యచౌదరి, బండ్లమూడి విజయలక్ష్మి, నల్లూరి బాబ్జి జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. గాయని, గాయకులు పత్రి నిర్మల, సీహెచ్ సుధాశ్రీనివాస్, సీహెచ్ రాజ్యలక్ష్మి, ఎండీ జరీనా, జి.హరికృష్ణ, ఎస్.కమల్‌కిషోర్, బి.వీరయ్య, డాక్టర్ ఎ.వీర రాఘవ, బి.కృష్ణప్రసాద్ తమ గాన మాధుర్యంతో అలనాటి మేటి చిత్రాల్లోని భక్తి, సినీ గీతాలను ఆలపించారు. కీబోర్డుపై కె.రవిబాబు, తబలాపై ఎస్.వెంకట్, పాడ్స్‌పై టి.ఈశ్వర్ వాయిద్యాన్ని అందించారు. కార్యక్రమాలను కె.మదన్మోహన్‌రావు పర్యవేక్షించగా, కళాకారులను సత్కరించారు.

సీపీఐ ప్రచార ఆందోళన కార్యక్రమం ప్రారంభం



లక్ష్మీపురం: దేశంలో హిందూ మతం పట్ల మెజారిటీ ప్రజలకు ఉన్న అభిమానాన్ని ఆసరాగా చేసుకుని తమ రాజకీయ స్వార్థానికి మతాన్ని పావుగా వాడుకుంటున్న నరేంద్ర మోదీ, ఆర్ఎస్ఎస్, బీజేపీ హిందూ మత ప్రతిష్టను దెబ్బతీస్తున్నాయని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు విమర్శించారు. నరేంద్ర మోదీ నిరంకుశ, అప్రజాస్వామిక విధానాలకు వ్యతిరేకంగా భగత్ సింగ్ వర్ధంతి నుంచి ఏప్రిల్ 14 డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వరకు ప్రచార ఆందోళనలు నిర్వహించాలని సీపీఐ జాతీయ సమితి ఇచ్చిన పిలుపులో భాగంగా ఆదివారం గుంటూరులో జరిగిన ప్రచార ఆందోళన కార్యక్రమాన్ని ముప్పాళ్ల ప్రారంభించారు. కొత్తపేటలోని భగత్ సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ భారతదేశ ఆర్థిక వ్యవస్థను మోదీ ప్రభుత్వం బలహీనవరుస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. సీపీఐ గుంటూరు జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ మాట్లాడుతూ నరేంద్ర మోదీ ప్రభుత్వం తన ఆర్థిక విధానాలతో దేశాన్ని అత్యంత అధమ స్థానానికి తీసుకువెళ్ళుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పుష్పాల సత్యనారాయణ, మేడా హనుమంతరావు, ఆకిటి అరుణ్ కుమార్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్జీ, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కొల్లి రంగారెడ్డి, సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

భారతీయ అంబేడ్కర్ సేన రాష్ట్ర అధ్యక్షుడిగా గణపతి



నెహ్రూనగర్: భారతీయ అంబేడ్కర్ సేన రాష్ట్ర అధ్యక్షుడిగా ఉలగనాథన్ గణపతి ఎన్నికయ్యారు. అంబేడ్కర్ సేన రాష్ట్ర కార్యవర్గ ఎన్నిక సంఘ వ్యవస్థాపక అధ్యక్షులు పీటీఎం శివప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం బ్రాడీపేటలోని ఓ హోటల్‌లో ఎన్నిక నిర్వహించారు. అంబేడ్కర్ సేన ఉపాధ్యక్షులుగా కె.మోహన్‌రాజు, బంగారు రాజు, పాలకుంట శ్రీనివాసులు, వి దొరస్వామి, ప్రధాన కార్యదర్శులుగా పల్లం తాతయ్య, ఎం.ముత్యాలు, తిప్పనబోయిన మల్లికార్జున, అధికార ప్రతినిధులుగా జి.రాము, దుర్గం పుల్లారావు, ముత్యాల మోహన్, మల్లె మొగ్గల ఉమాపతి, కోశాధికారిగా నీరుగట్టి రమణయ్య, సెక్రటరీలుగా చక్రవర్తి, గంగాధర్, అన్నమయ్య, జగన్మోహన్, సాల్మన్‌రాజు, ప్రమీల, బి.మహేష్, ఓబులేసు, యంజారప్ప, బాలకృష్ణ, చింతా సుందర్‌రాజు ఇతర సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు, ఏఎం ఖాన్ అంజానీ, పేరూరి మురళి కుమార్, పూలతోట కష్టారావు, మొండెం శ్రీనివాస్, కైలా జయసుధ పాల్గొని ప్రసంగించారు.

నూతన విద్యా పాలసీని రద్దు చేయాలి



కొత్తపేట భగత్ సింగ్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు

లక్ష్మీపురం: ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ గుంటూరు జిల్లా సమితి ఆధ్వర్యంలో కొత్తపేట భగత్ సింగ్ విగ్రహం వద్ద భగత్ సింగ్, రాజుగురు, సుఖదేవుల వర్ధంతి ఆదివారం నిర్వహించారు. వారి విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్ జీ మాట్లాడుతూ దేశంలోనూ, రాష్ట్రంలోనూ నూతన జాతీయ విద్యా విధానం పేరుతో దేశంలో ఉన్నటువంటి విద్యను పేద విద్యార్థులకు అందకుండా కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు. ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ వలి మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ సారథ్యంలో నరేంద్ర మోదీ మన దేశంలోని ప్రభుత్వ సంస్థలను ప్రైవేట్ పరం చేస్తూ యువత శ్రమను కార్పొరేట్ రంగాలకు అప్పగిస్తోందని చెప్పారు. ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టడానికి భగత్ సింగ్, రాజ్ గురు సుఖదేవ్ యొక్క పోరాట స్ఫూర్తితో పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి యశ్వంత్, నగర కార్యదర్శి ప్రణీత్, ఖాసీం వలి, డేవిడ్, అజయ్, సాగర్, వెంకీ, కిరణ్, గౌతమ్, శశి, మస్తాన్, సాయి గణేష్ పాల్గొన్నారు.

భగత్ సింగ్ యువతకు స్ఫూర్తి



మాట్లాడుతున్న సీఎస్ ప్రసాద్, వేదికపై సీపీఎం నాయకులు

లక్ష్మీపురం: కార్మికవర్గ రాజ్యం స్థాపన ద్వారానే సమాజంలో అసమానతలు తొలగిపోతాయని విప్లవ రచయితల సంఘం నాయకులు సీఎస్ఆర్ ప్రసాద్ అన్నారు. స్థానిక బ్రాడీపేటలోని సీపీఎం కార్యాలయంలో ఆదివారం భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ వర్ధంతి నిర్వహించారు. సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో లెనిన్ రచించిన 'రాజ్యం – విప్లవం' పుస్తకంపై విశ్లేషణ కార్యక్రమానికి జి.వెంకటరావు అధ్యక్షత వహించారు. తొలుత భగత్ సింగ్ చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ మాట్లాడుతూ ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం పెట్టుబడిదారులకు ఊడిగం చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శి కె.నళినీకాంత్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాశం రామారావు, నగర కార్యదర్శివర్గ సభ్యులు బి.ముత్యాలరావు, కట్లగుంట శ్రీనివాసరావు, బి.సత్యనారాయణ, జిల్లా కమిటీ సభ్యులు ఎంఏ చిష్తి, జి.రమణ, షకీలా, ఎ.కల్యాణి పాల్గొన్నారు.

భగత్ సింగ్‌ని ఈతరం స్ఫూర్తిగా తీసుకోవాలి

లక్ష్మీపురం: భగత్‌సింగ్‌ని నేటి తరం స్ఫూర్తిగా తీసుకోవాలని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అన్నారు. కొత్తపేటలోని భగత్ సింగ్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ భారత మాత విముక్తి కోసం తన సహచరులు రాజగురు, సుఖదేవ్‌లకు ఉరి కొయ్యాల్ని చుద్దాడి ఆనాడు లక్షలాది మంది యువతకు స్ఫూర్తినిచ్చారన్నారు. విద్యావేత్త ఇ.చంద్రయ్య మాట్లాడారు. కార్యక్రమంలో సంస్కార భారతి జిల్లా అధ్యక్షుడు పి.శ్రీధర్, ఆర్.వెంకటరత్నం, మురళీకృష్ణ, భావన్నారాయణ పాల్గొన్నారు.

ఐకమత్యం ద్వారానే విశ్వబ్రాహ్మణుల అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న విశ్వబ్రాహ్మణ సంఘం పట్టణ అధ్యక్షులు సుబ్బారావు

నెహ్రూ నగర్: సమష్టిగా విశ్వబ్రాహ్మణ సంఘం అభివృద్ధి సాధించేలా గుంటూరు పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం కృషి చేస్తుందని ఆ సంఘం అధ్యక్షులు కడియాల సుబ్బారావు పేర్కొన్నారు. విశ్వబ్రాహ్మణ సమాజం ఆత్మీయ సమావేశం అరండల్‌పేట విశ్వబ్రాహ్మణ సమాజ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం శాసనమండలికి తప్పనిసరిగా ఒకరిని నామినేట్ చేస్తామన్న మంత్రి లోకేష్ త్వరలో ఒక నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నట్లు తెలిపారు. పశ్చిమ నియోజకవర్గం శాసన సభ్యురాలు గళ్లా మాధవి ఆదేశానుసారంగా విశ్వబ్రాహ్మణుల అభివృద్ధికి కావలసిన సంక్షేమ ఫలాలు అందుకోవటంలో వర్గాల కతీతంగా కలసికట్టుగా ముందుకు రావాలని కోరారు. కార్పొరేషన్, ఆదరణ వంటి పథకాల ద్వారా మంజూరు చేసే రుణాల కోసం దరఖాస్తులు చేసుకునే అవకాశం ఈనెల 25వ వరకు ఉన్నదని తెలియజేశారు. అమరావతి రోడ్డులోని బ్రహ్మంగారి దేవస్థానం పాలకవర్గాన్ని ఏర్పాటు చేసే క్రమంలో శాసనసభ్యులు గళ్లా మాధవికి పూర్తి స్వేచ్ఛనిచ్చినట్లు చెప్పారు. సమావేశంలో వెంకటప్రసాద్, సిద్దు చిరంజీవా చారి, భజరంగ్ రామకృష్ణ, కే లక్ష్మీనారాయణ, వేల్పూరి ఉమామహేశ్వరరావు, ఎస్.సాంబశివరావు, పి.శేష గిరిరావు, ఎమ్మెస్ రామకృష్ణ, డీఆర్సీ ప్రసాద్, డీవీ సుబ్బారావు పాల్గొన్నారు.

మద్యం దుకాణంలో చోరీ

పట్నంబజారు: మద్యం దుకాణంలో చోరీ జరిగిన ఘటనపై కేసు నమోదు అయింది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాలు... ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఉన్న యాపిల్ వైన్స్‌లో శనివారం రాత్రి చోరీ జరిగింది. రూ.20 వేలు నగదు, 30 వేలు విలువచేసే మద్యాన్ని గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. వైన్స్ నిర్వాహకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నారీ లోకానికి దర్పణం గోగినేని భారతి



అతిథిని సన్మానిస్తున్న దృశ్యం

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం శ్రీ పద్మావతి కల్యాణ మండపం వేదికపై ఆచార్య ఎన్‌జీ రంగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ జక్కంపూడి సీతారామారావు నిర్వహణలో గోగినేని భారతీదేవి జ్ఞాపకార్థం సభ ఆదివారం నిర్వహించారు. ఆలయ పాలకమండలి అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. చిగురుపాటి రవీంద్రబాబు సభాధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథి పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్, వక్తలు విశ్రాంత అధ్యాపకులు వెలగా పుష్పకుమారి, విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ వెలివోలు నాగరాజ్యాలక్ష్మి, డాక్టర్ జక్కంపూడి సీతారామారావు మాట్లాడారు. సభాధ్యక్షులు చిగురుపాటి రవీంద్రబాబు మాట్లాడుతూ గోగినేని భారతి నారీ లోకానికి దర్పణమని అన్నారు. బడుగు బలహీన వర్గాలు, చేతి వృత్తుల వారు, రైతులకు చేసిన సేవలు, త్యాగాలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. విశ్రాంత ప్రిన్సిపల్ నాగరాజ్యాలక్ష్మి మాట్లాడుతూ మహిళలకు ఉద్యమ స్ఫూర్తిని కల్పించారని అన్నారు. అనంతరం వక్తలను సత్కరించగా, పీవీ రమణ బృందం రైతు భజనావళి పాటలు ఆలపించి ఆహుతులను అలరించారు.

ఏసీ కళాశాల అధ్యాపకురాలు నిర్మలకు పీహెచ్‌డీ ప్రదానం



గుంటూరు ఎడ్యుకేషన్: సాంబశివపేటలోని ఏసీ కళాశాలలో ఆర్థికశాస్త్ర అధ్యాపకురాలిగా పని చేస్తున్న బుర్రి నిర్మలకు ఏఎన్‌యూ పీహెచ్‌డీ పట్టా ప్రదానం చేసింది. 'యాన్ ఎకనామిక్ ఎనాలసిస్ ఆఫ్ డైరీ ఫార్మింగ్ ఇన్ గుంటూరు డిస్ట్రిక్ట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్' అంశంపై ఏఎన్‌యూ ఎకనామిక్స్ విభాగాధిపతి ఆచార్య కడిమి మధుబాబు పర్యవేక్షణలో ఆమె పరిశోధన చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బుర్రి నిర్మలకు సహచర అధ్యాపకులు, పరిశోధకులు అభినందనలు తెలిపారు.

పాఠశాలకు బీరువా బహూకరణ

గుంటూరు ఎడ్యుకేషన్: సంజీవయ్యనగర్‌లోని నగరపాలకసంస్థ ప్రాథమిక పాఠశాలకు గ్రంథాలయ పుస్తకాలను భద్రపరచేందుకు ఏఎస్పీ ఫౌండేషన్ చైర్మన్ సత్యప్రకాష్ బీరువాను బహూకరించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.ప్రభూజీ ఆదివారం తెలిపారు. ఈసందర్భంగా సత్యప్రకాష్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి రోజూ పాఠశాలకు వచ్చి, చక్కగా చదువుకోవాలని, చదువుతో పాటు ఇష్టమైన కళలపై ఆసక్తి కనబర్చాలని సూచించారు. పాఠశాల కమిటీ చైర్మన్ కర్రా పరిమళ మాట్లాడుతూ విద్యార్థులు విద్యావంతులుగా ఎదిగి, మరొకరికి సాయం అందించే స్థాయికి ఎదగాలని సూచించారు. ప్రభూజీ మాట్లాడుతూ విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకుని మంచి నడవడిక అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ కోశాధికారి సాయిరాం, పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు పి. శ్రీనివాసరావు, షేక్ హాఫ్‌సా, షాజహాన్, రత్నకుమారి, శిరీష, సౌజన్య, అంజమ్మ, మౌనిక పాల్గొన్నారు.

ప్రజావసరాలు తీర్చేవిధంగా బ్రిడ్జి నిర్మించాలి

- ముందుగానే ఆర్‌యూబీ ఏర్పాటు చేయాలి
- చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ఏల్చూరు



మాట్లాడుతున్న చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు

లక్ష్మీపురం: గతంలో ప్రకటించిన డిజైన్ ప్రకారం హిందూ కాలేజి నుంచి లాడ్జి సెంటర్ వరకూ బ్రిడ్జి నిర్మించాలని పౌర సంస్థల జేఏసీ నాయకులు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు ఏల్చూరు వెంకటేశ్వర్లు అన్నారు. బ్రాడీపేటలోని బాల నంద క్రేందంలో ఆదివారం శంకర్ విలాస్ బ్రిడ్జి పునఃనిర్మాణం నేపథ్యంలో ప్రస్తుత డిజైన్‌లో పలు మార్పులు చేయాలని కోరుతూ పౌర సంస్థల ఆధ్వర్యంలో ఫెడరేషన్ ఆఫ్ అపార్ట్‌మెంట్స్ అండ్ కాలనీస్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ ఎల్.ఎస్.భారవి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భవిష్యత్ కార్యాచరణ అమలు కోసం జేఏసీ ఏర్పాటు చేశారు. ఈనెల 26న శంకర్ విలాస్‌లో ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రచార కార్యక్రమం నిర్వహించాలని, కరపత్రాలు విస్తృతంగా పంపిణీ చేయాలని, షాపుల వద్ద బ్యానర్లు ఏర్పాటు చేయాలని, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు ఇవ్వాలని నిర్ణయించారు.

పౌర సంఘాల సమాఖ్య నాయకులు కె.నళినీకాంత్ మాట్లాడుతూ రాబోయే 50 ఏళ్ల కాలంలో ప్రజల అవసరాలు తీర్చే విధంగా బ్రిడ్జి ఉండాలన్నదే తమ ఆకాంక్ష అని చెప్పారు. ఇప్పుడున్న డిజైన్ ప్రకారం జీజీహెచ్‌కి వెళ్లేందుకు, బ్రాడీపేట– అరండల్‌పేట మధ్య సరైన అనుసంధానం లేదన్నారు. బడ్జెట్ పరిమితి పెట్టుకొని ఇంత వరకే బ్రిడ్జి కడతాం అని చెప్పటం సరికాదన్నారు. ప్రస్తుత డిజైన్‌లో స్లోప్ తక్కువ ఉండటం వలన సైకిల్‌పై వెళ్లే వారు, నడిచి వెళ్లే వారు కష్టంగా బ్రిడ్జి ఎక్కాల్సి ఉంటుందని పేర్కొన్నారు. రాజధానికి వెళ్లే ప్రధాన మార్గంలో నిర్మించబోయే ఈ బ్రిడ్జి ఐకానిక్‌గా ఉండాలని అభిప్రాయపడ్డారు. డిజైన్ మార్పుల కోసం జరిగే కార్యాచరణలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో బిల్డర్స్ అసోసియేషన్ నాయకులు గద్దె తిరుపతిరావు, సీతారామయ్య, రేట్ పేయర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ, ఫోరం ఫర్ డెమోక్రటిక్ అసోసియేషన్ నాయకులు అవధానుల హరి, ప్రోగ్రెసివ్ ఫోరం నాయకులు మల్లికార్జునరావు, ఎస్‌హెచ్ఓ అధ్యక్షులు డాక్టర్ టి.సేవాకుమార్, గుంటూరు గృహ యజమానుల సంఘం మూర్తి, సీనియర్ సిటిజన్ అసోసియేషన్ నాయకులు కైలాస్‌నాథ్, సదాశివరావు, గురుదత్, మట్టుపల్లి సుబ్బారావు పాల్గొని ప్రసంగించారు.

గుండె జబ్బులపై నిర్లక్ష్యం తగదు

డాక్టర్ ఆళ్ల గోపాలకృష్ణ గోఖలే



గుంటూరు మెడికల్: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ, శ్రీ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక జేకేసీ కళాశాల ఆవరణలో దాదాపు 700 మంది గుండె జబ్బుల రోగులకు ప్రముఖ హార్ట్, లంగ్ ట్రాన్స్ ప్లాంట్ సర్జన్ డాక్టర్ ఆళ్ల గోపాలకృష్ణ గోఖలే నేతృత్వంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వివిధ జిల్లాల నుండి దీర్ఘకాలంగా గుండె సంబంధిత జబ్బులతో బాధపడుతూ హాజరైన రోగులకు బీపీ, షుగరు, ఈసీజీ, ఎకో పరీక్షలు నిర్వహించి, వైద్యుల సూచనల మేరకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ గోఖలే మాట్లాడుతూ గుండె వ్యాధులపై నిర్లక్ష్యం తగదన్నారు. డాక్టర్ల సూచనలు తప్పక పాటించాలని చెప్పారు. గతంలో గుండెకు శస్త్ర చికిత్స చేయించుకున్న వాళ్లు కనీసం ఏడాదికి ఒకసారి గుండె వైద్యులను సంప్రదించి పరీక్ష చేయించుకోవాలని సూచించారు. మారుతున్న జీవన శైలిలో సమతుల్య ఆహారంతో పాటు చక్కటి వ్యాయామం చేయాలని తెలిపారు. శ్రీ హాస్పిటల్ గుండె వైద్య నిపుణులు డాక్టర్ బి.వి.నారాయణరెడ్డితో డాక్టర్ వై.రామ కిషోర్, డాక్టర్ ఆనం నందకిషోర్ తదితర వైద్య సిబ్బంది ఈ శిబిరంలో పాల్గొని రోగులను పరీక్షించి సలహాలు, సూచనలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల సెక్రెటరీ జాగర్లమూడి మురళీ మోహన్, జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, మానవత చైర్మన్ పావులూరి రమేష్, అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీనివాసరావు, మెడికల్ క్యాంప్స్ చైర్మన్ టి. ధనుంజయ రెడ్డి, కార్యదర్శి కె.సతీష్, కోశాధికారి టీవీ సాయిరాం, కళాశాల ప్రిన్సిపాల్ గోపీచంద్, కార్యక్రమాల విభాగ చైర్ పర్సన్ పి.నాగ సుశీల, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు. ఈ వైద్య శిబిరంలో పాల్గొని సేవలందించిన వైద్య సిబ్బందిని, కళాశాల విద్యార్థులను నిర్వాహకులు ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు.

కోవిడ్ ఫైటర్స్ సేవలు అభినందనీయం

కమిషనర్ పులి శ్రీనివాసులు



గుంటూరు మెడికల్: కోవిడ్ ఫైటర్స్ స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయమని కార్పొరేషన్ కమిషనర్ పులి శ్రీనివాసులు పేర్కొన్నారు. స్థానిక కోబాల్ట్ పేట మూడో లైన్‌లో సంస్థ ఆధ్వర్యంలో 30 మంది పేద మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గుంటూరు నగరంలో కోవిడ్ బారిన పడి మరణించిన వేలాదిమందికి ఉచితంగా దహన సంస్కారాలు, లక్షలాదిమంది పేదలకు భోజన సదుపాయం, అంబులెన్స్‌తో వందలాది మందికి ఆరోగ్య సేవలు అందించడం హర్షణీయమని అన్నారు. నాలుగు నెలలుగా శిక్షణ అందించి ఉచితంగా నూతన కుట్టుమిషన్లను బహూకరించి వారిలో ఆత్మవిశ్వాసం, ఆత్మస్థైర్యాన్ని నింపి, సాధికారత వైపు పురోగమించేటట్టు కోవిడ్ ఫైటర్స్ కృషి చేయడాన్ని స్వాగతించారు. నగరంలోని దాతత్వం గల సంస్థలను ఒక విశాల వేదికను ఏర్పాటు చేసి గుంటూరు నగరపాలక సంస్థ ద్వారా సేవా కార్యక్రమాలు విస్తృత పరుస్తామన్నారు. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, కోవిడ్ ఫైటర్స్ వ్యవస్థాపకులు పఠాన్ అల్లాబక్షు, కార్మెల్ సేవా సదన్ వ్యవస్థాపకుడు జాక్ క్లమాకస్(గోతాల స్వామి), డాక్టర్ ఇబ్రహీం, డాక్టర్ ఆదం ఖాన్, రుద్ర చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు సుభాని, నేస్తం వ్యవస్థాపకులు జలీల్ అహ్మద్, జవహర్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ ప్రిన్సిపాల్ అస్ర హుస్సేన్, టోపీ బాబు, సైజుద్దీన్, ఆవాజ్ నేత చిష్టి, బాజీ భాయ్ పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలకు దరఖాస్తుల ఆహ్వానం

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద గృహాలు నిర్మించుకునేందుకు అవకాశం కల్పించిందని ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్‌బాషా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సొంత స్థలం కలిగి ఉండి, గృహం నిర్మాణం చేసుకొనుటకు సిద్ధంగా ఉన్న అర్హత కలిగిన కుటుంబాల వారు 4బీ అప్లికేషన్ ఫాంను గ్రామ, వార్డు సచివాలయాల కార్యాలయాల్లో ఈ నెల 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అర్జీదారులు, వారి భర్తతో కలసి ఉన్న ఫొటోను విధిగా అర్జీకి అతికించాలని, ఆదాయ ధ్రువీకరణ పత్రం రేషన్ కార్డు, కరెంట్ బిల్లు, హౌస్ ట్యాక్స్ బిల్లు, ఓటరు ఐడీ కార్డు, కుటుంబ సభ్యులు అందరి ఆధార్ కార్డుల నకళ్లు, కుల ధ్రువీకరణ పత్రం, వ్యక్తిగత బ్యాంకు ఖాతా మొదటి పేజీ, ఇంటి పట్టా లేదా సొంత ఇంటి స్థలం డాక్యుమెంటు అందించాలని కోరారు.